




ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
21-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 200

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



## రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు.. మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు



వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు



విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు



పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు



పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు



విద్యా శాఖకు రూ.26,674 కోట్లు



వైద్య శాఖకు రూ.13,679 కోట్లు

కార్మిక శాఖకు రూ.998 కోట్లు

మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు

ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు

మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు




తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు.



రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

### ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు

- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు...
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం

### కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా

తెలంగాణ ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తీసుకువస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

2లో

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

- ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు

2లో

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

### అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ

### బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**హైదరాబాద్, ప్రభాత సూర్య :** అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ

## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

### హరీస్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం

### పదో తరగతి పరక్షలు లేకుండా 12 తరగతులు

- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన క ఎటిఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు
- మీడియతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మార్చి 20 (ఆర్ఎన్ఎ): ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు

## హర్మ్యూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

- ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- యూరోపియన్ దేశాలు సైతం మద్దతు
- మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు
- అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు

**వాషింగ్టన్/లండన్ ప్రభాత సూర్య :** హర్మ్యూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మ్యూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు,



4లో

## విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన!

### తెలంగాణలో పదో తరగతి పరీక్షలు రద్దు



ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఏకీకృత విద్యా విధానం

దూకుడుగా సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** తెలంగాణలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు రేవంత్ సర్కార్ గట్టిగా ప్రయత్నాలు ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది.

2లో

## జగన్‌కు తప్పని కుటుంబ పోరు!

### తన కుమార్తె పిల్లలను అన్యాయం చేస్తున్నాడు అంటున్న విజయమ్మ

### అన్న అనే పదానికి కలంకం అంటున్న షర్మిల

### తన తండ్రి హత్య నిందితులను కాపాడుతున్నాడు అంటూ వైయస్ సునీత

4లో

## జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం

### 20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం

### ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ

### మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు

ఉగాది ఉత్సవాల్లో సిఎం

## నేడు పవిత్ర రంజాన్ పండగ

### ముగిసిన రంజాన్ ఉపవాసాలు

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక

# బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

**హైదరాబాద్,ప్రభాత సూర్య :** తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీశ్‌రావు విమర్శించారు.



బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు.

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన – ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి



పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి

పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్ట్‌లు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్ట్ టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం

ఈ పథకం వల్ల రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జూన్ 2వ తేదీ నుంచి అమలు చేస్తామని ఆయన వివరించారు. 2026-27 వార్షిక బ్జడెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వార్షిక బ్జడెట్ రూ.3,24,234 కోట్ల అంచనాలతో రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

## నేడు పవిత్ర రంజాన్ పండగ

ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

## విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన!

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమూల ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జాతీయస్థాయిలో విద్యావ్యవస్థను అధ్యయనం చేసి తెలంగాణలో ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో ఇకనుంచి టెన్త్ పరీక్షలను తొలగించనున్నట్లు కూడా సూత్రప్రాయంగా చెప్పుకొచ్చారు సీఎం రేవంత్. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానంలో విద్యాబోధన చేసేందుకు కసరత్తు జరుపుతున్నట్లు సమాచారం. జాతీయస్థాయిలో ప్లస్ 2 విధానం అమల్లో ఉంది. అదేవిధంగా తెలంగాణలో అమలు చేసేందుకు రేవంత్ సర్కార్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**ఎస్ ఎస్ సి సర్టిఫికెట్ బోర్డు రద్దు..:** విద్యా వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా తెలంగాణలో సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ బోర్డు తొలగించనున్నారు. పదో తరగతి పరీక్షలకు కూడా ఇకనుంచి పెట్టబోరని తెలుస్తోంది. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా తెలంగాణ సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 200 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. నర్సరి నుంచి 12వ తరగతి వరకు ఏకీకృత విధానం.. పదో తరగతి బోర్డు పరీక్షల రద్దు.. నిరంతర మూల్యాంకనం.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య ఆధారిత విద్య పై దృష్టి సారించింది తెలంగాణ సర్కార్.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 100 మండలాల్లో 200 అత్యున్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేయనుంది. నర్సిరెడ్డి నుంచి 12వ తరగతి వరకు ఒకే పాఠశాల ప్రాంగణంలో విద్యను అందించే విధానం అందుబాటులోకి రానుంది. ఇది విద్యార్థులపై భారాన్ని తగ్గిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఇకపై నిరంతర మూల్యాంకనం..:** ఇప్పటివరకు విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం. కానీ సాంప్రదాయ పదో తరగతి బోర్డు పరీక్షలను బదులుగా.. నిరంతర మూల్యాంకనం ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి అందుకు అనుగుణంగా బోధన అందించేందుకు సిద్ధపడుతోంది.

# కార్మికులను కట్టు బానిసలుగా,శ్రమ దోపిడికి గురిచేసే 4 లేబర్ కోడ్ ల అమలును వెనక్కి తీసుకోవాలి. ఆర్. జనార్ధన్ ఐ ఎఫ్ టి యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు....




**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య:** మార్చ్ 23 న,హైదరాబాద్ సెంట్రల్ లేబర్ కమిషనరేట్ ముందు జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి. ఆర్. జనార్ధన్,ఐ ఎఫ్ టి యు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ల అమలును వెంటనే బీ జే పీ మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని,లేదంటే కార్మిక వర్గం నుండి తీవ్ర ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందని కేంద్ర బీ జే పీ మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం రోజున సంస్థాన్ నారాయణ పురం మండలం లచ్చమ్మగూడెం లో బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం,సమానత్వం కోసం పోరాడి వీరమరణం పొందిన కామ్రేడ్ షాహిద్ భగత్ సింగ్, కామ్రేడ్ రాజగురు,కామ్రేడ్ సుఖ్ దేవ్ ల వర్ధంతి రోజైన మార్చ్ 23 న, హైదరాబాద్ లేబర్ కమిషనరేట్ ముందు జరిగే మహా ధర్నాకు సంబంధించిన గోడ ప్రతులను ఐ ఎఫ్ టి యు, ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ,రోజుకు 8 గంటల పనిని 12 గంటలకు పెంచుతూ,శ్రమకు తగిన ఫలితాన్ని పొందలేని,పర్మనెంట్ చేయలేని,కనీస కవేతనాలు, మెరుగైన సౌకర్యాలను కల్పించలేని,కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ పేరిట కార్మికులపై అదనపు పని భారాన్ని పెంచి,హక్కులను,స్వేచ్ఛను హరించివేస్తూ గాలి,నీరు, ఎలాంటి చట్ట బద్ద హక్కులు,సౌకర్యాలు లేకుండా చేస్తూ, శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికులను నియమిస్తూ నయవంచనకు గురి చేసే 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను బీ జే పీ మోడీ ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేయ పూనుకున్నదని, 4 లేబర్ కోడ్ లు కార్మికులకు ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉన్నదని,అందుకని మోడీ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకొనే విధంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత,ఐ ఎఫ్ టి యు హైదరాబాద్ సిటీ నాయకులు కొర్ర మంగ్ల జిల్లా నాయకులు కొర్ర సర్వన్,ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు గుదే అచ్చయ్య, మందడి అమరేందర్ రెడ్డి, పీ వై ఎల్ జిల్లా కోశాధికారి పగడాల శివ, కొర్ర బుజ్జి, దోటి భిక్షం, గుదే సత్తెమ్మ,ప్రజా సంఘాల నాయకులు పోతగల్ల నర్సింహా,గొరుగంటి ముత్యాలు,మానుపాటి యాదయ్య,పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకు కిష్టయ్య కుటుంబానికి ఆర్థిక సాయంగా 50 కిలోల బియ్యం అందజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి...



ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య: ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక కిష్టయ్య అమ్మ కీర్తిశేషులు చిలుకు రాజా మల్లమ్మ ఇటీవలే మరణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి ఉచితంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుకు నాగరాజు, గ్రామ సర్పంచ్ కంతి మధు, వార్డ్ మెంబర్లు పెండ్యాల నాగరాజు, కంటి బాలరాజు, కంతి బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుట్టల స్వామి, నారి మల్లయ్య, మరిగాడు శ్రీనివాస్, కంతి రాములు, పూటల దశరథ, ఆడెపు స్వామి, మల్లపురం శ్రీనివాస్, చిలుకు ప్రకాష్, చిలుకు చంద్రశేఖర్, చిలుకు శ్రీశైలం, చిలుకు శ్రీను, పుట్టల గణేష్ ,కంతి మహేందర్, దూడల కళ్యాణ్, జేరిపోతుల కృష్ణ ,జేరిపోతుల మల్లేష్ ,పుట్టల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బల్ల సుశీల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్...



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య:** ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలోని బడి పంతులు బల్ల వెంకటేష్ మాతృమూర్తి అయిన బల్ల సుశీల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్, పాపకారిమాధవ రెడ్డి, ధర్మ గోవర్ధన్ రెడ్డి, యాట యాదేశ్, రమేష్, గంజి. హనుమంతు, ఎలగందుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

## సకల జనులను సంపూర్ణంగా ముంచిన బడ్జెట్

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 20(ప్రభాత సూర్య):** తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ సకల జనులను సంపూర్ణంగా ముంచిన బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అంకెలతో గారడీ నిధులు నిల్ మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులు ఊసే లేదు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానికి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల ఊసే లేదు,తెలంగాణ ప్రజలను పూర్తిగా దగా చేశారు.ఇప్పటికైనా ప్రజలు కండ్లు తెరిస్తే తప్ప మన పోరాటంలో ద్వారానే హక్కులను సాధించుకుందాం.

## వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ స్థలంలో

# ఉగాది వేడుకలు



**మునుగోడు, మార్చి 20(ప్రభాత సూర్య)::** మునుగోడు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం గాంధీనగర్ కాలనీలో నూతనం గా నిర్మాణం చేపట్టబోతున్న వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం స్థలంలో పరాభవ నామ సంవత్సర ఉగాది తెలుగు సంవత్సర వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు.. ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ లు పాల్గొని గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు..అభిలాష్ పంతులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు..సర్పంచ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించే వెంకటేశ్వర స్వామి ఆలయానికి గ్రామస్థులు తమ వంతుగా సహాయ సహకారాలు అందించి,త్వరితగతిన నిర్మాణం పూర్తి అయ్యేలా తోడ్పడాలని కోరారు.. దుమ్మాటి చెన్నయ్య 50 వేల రూపాయలు గుడి నిర్మాణానికి అందజేశారు. సత్య ఫంక్షన్ హాల్ చిలువేరు సత్యనారాయణ ఆలయంలో నీటి వసతి సదుపాయం కొరకు బోరు



వేయిస్తామని ముందుకు వచ్చారు.మధు సూదన్ రెడ్డి 200 సిమెంట్ బస్తాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారు....ఈసందర్భంగా వీరిని గ్రామస్థులు అభినందించారు...కర్నాటి పెద్ద మల్లయ్య, సాగర్ల శ్రీను,సంగిశెట్టి పరమేశ్, పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, యారసాని రాములు, దొమ్మాటి రాజు,జానీ, యాట రామసాని, దుబ్బ వెంకన్న,రెవెల్లి మారయ్య,పాలకూరి లక్ష్మయ్య,,బొడ్డుపల్లి ముత్యాలు,, నరసింహ,, యాదయ్య,వెంకటయ్య, రాజు,శ్రీకాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.,.

# అనుమతులకు విరుద్ధంగా కమర్షియల్ షెటర్ల నిర్మాణం

### వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** ఆదిభట్ల సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పెరుగు తున్నా టౌన్ ప్లానింగ్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. అనుమతులకు విరుద్ధంగా కమర్షియల్ షాపులు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు కేవలం నోటీసులకే పరిమి తమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నా రు.తొర్రూరు డివిజన్ లోని మునగనూరు వార్డు కార్యాలయం వద్ద నూతనంగా ప్రారంభం అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు ఒకటే వరుసలో అక్రమంగా కమర్షియల్ షెటర్లు నిర్మిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ నిర్మాణాలు మరింతగా పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తనిఖీలు చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## రైతు సంఘం జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగాఎంపికైన: కంపె దుర్గయ్య



**గట్టుప్పల్ ప్రభాత సూర్య మార్చి. 20:**గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కంపె దుర్గయ్య తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారిగా, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని రైతులు పండించిన పత్తి వరి మిరప తదితర పంటలకు మద్దతు ధర లభించేంతవరకు పోరాడుతామని తెలిపారు జిల్లా కోశాధికారిగా ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ, సీపీఐ పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి గుజ్జ రామచంద్రం, సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ విశిష్టత.....




**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య :** రంజాన్ (రమదాన్) ముస్లింలగు అత్యంత పవిత్రమైన మాసం.ఇది ఆత్మ నియంత్రణ, దైవభక్తి మరియు దానధర్మాలకు ప్రతీక .నెల రోజుల పాటు పగలు ఉపవాసం (రోజా)ఉంటూ,ఖురన్ పాటిస్తూ, పేదలకు సహాయం( జకాత్ ) చేస్తారు. ఇది మానవతావాదాన్ని, శాంతిని చాటుతూ అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలిపే పండుగ. పవిత్ర మాసం : ఇస్లామిక్ క్యాలెండర్లో 9 వ నెల రంజాన్ ఈ సమయంలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని నమ్మకం. ఉపవాస దీక్ష (రోజా): రోజున తెల్లవారుజామున (సహ్రీ) నుండి సూర్యాస్తమయం (ఇఫ్తార్ ) వరకు అన్నపానీయాలు మాని, క్రమశిక్షణ తో ఉపవాసం పాటిస్తారు. దానధర్మాలు(జకాత్ ఽసదఖా): రంజాన్ లో దానధర్మాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. పేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవడానికి తమ సంపాదనలో కొంత భాగాన్ని దానంగా ఇస్తారు. ఆత్మశుద్ధి ఽ క్రమశిక్షణ: కోపాన్ని చెడు ఆలోచనలను అదుపులో ఉంచుకొని, దైవచింతనతో గడపడం ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం దీని ముఖ్య ఉద్దేశం. లైలత్ అల్ -ఖద్ర్: రంజాన్ చివరి పది రాత్రులలో వచ్చే ఈ రాత్రి అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.ఆ రాత్రులలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈద్-ఉల్-ఫితర్: నేల రోజుల ఉపవాసాల తర్వాత, నేల వంక కనిపించాక జరుపుకునే సంబరమే ఈద్-ఉల్-ఫితర్. అందరూ కొత్త బట్టలు ధరించి, ప్రత్యేక ప్రార్థనా(నమాజ్ ) చేసి షిర్ ఖుర్మా తింటూ ఆనందాన్ని పంచుకుంటారు. ఈ పండుగ మానవులలో ఓర్పు, దయ, సోదర భావాన్ని పెంపొందిస్తుంది. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ గుండు మధుసూదన్....

## మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాసపురం గ్రామంలోని MPPP విద్యార్థిని విద్యార్థులకు 43 ఇంచుల TV బహుకరణ.




**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య...:** ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడం కోరకు మరియు ఆనులైన్ విద్య విధానం పై అవగాహన కలగడం కోరకు ప్రధానోపాధ్యాయులు మడిపల్లి నర్సింహులు మరియు ఉపాధ్యాయుని ఉపాద్యాయుల సమక్షంలో శుక్రవారం రోజున మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒక్క 43 ఇంచుల టీవీని సంస్థ ద్వారా విద్యార్థిని విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా గ్రామ సర్పంచ్ వడ్ల శోభన్ బాబు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ అద్యక్షులు కోంద్రాజు వెంకటేశ్వర రాజు మాట్లాడుతూ ఈ సంస్థ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ఆనాద పిల్లలకు ఆనాద వృద్దులకు నిరుపేద కుటుంబాలకు వికలాంగులకు సంబంధించి ఏదైనా సమాచారం మా దృష్టికి వచ్చిన విషయంపై మా వంతు సహాయ సహకారాలు మాకు సాద్యమైనంత వరకు ఈ సంస్థ ద్వారా అందించడం కొరకు ఈ సంస్థ నిరంతరం పనిచేస్తోంది అని అన్నారు. ఈ సంస్థ ఏలాంటి లాభాపేక్ష లేకుండా కుల మతాలకు అతీతంగా మండలం లోని గత రెండు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మరిన్ని సేవకార్యమలతో ఆలేరు మండలం లోని అన్ని గ్రామాల అన్ని వర్గాల ప్రజలం కలిసి మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో సేవ బావం కలిగి ఉన్న సుమారు 20 మంది సభ్యులం కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం కొరకు ఏర్పాటు చేసిన సంస్థ మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తుంగ కుమార్ , కోశాధికారి చిక్క శ్రావణ్ కుమార్, సంస్థ సభ్యులు , దూసరి మురళీధర్ , బిమగని రమేష్, ఎర్రగొల్ల పాండు కందడి ప్రకాష్ రెడ్డి , సంద్ద ఉపేందర్, క్రాంతి నాయక్ , గల్మ రాజిరెడ్డి, మరియు గ్రామంలోని నాయకులు చౌడబొయిన మహేశ్ , అయిలయ్య , సురేష్ చంద్రయ్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన సీనియర్ నాయకులు బందెల సుభాష్...



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బందెల సుభాష్ బిజెపి క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు బిజెపి పట్టణ అధ్యక్షులు నంద గంగేష్, జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ కి సామాజిక మాధ్యం ద్వారా తన రాజీనామా లేఖను సమర్పించనని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో దేశంలో పార్టీ బలపడుతున్న ఆలేరు పట్టణం లో స్థానికంగా కొందరు నాయకుల గ్రూపు తగాదాలు వల్ల పార్టీలో నాయకులు ఎదగలేకపోతున్నారని అన్నారు. ముఖ్యంగా పార్టీలో పని చేసే వారికి గుర్తింపు లేకుండా చేస్తున్నారని తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికలలో సొంత పార్టీ నాయకులే సహకరించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన.. జనగాం ఉపేందర్ రెడ్డి....



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్యబీ** ఆలేరు మున్సిపాలిటీ లో రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పవిత్రమైన పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్- ఉల్ -ఫితర్ తో ముగిస్తారని అన్నారు. ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదరా భావాన్ని కలిగి ఉండి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు.

## మెయిన్ రోడ్డు పై ఫ్లెక్సీలు నిషేధం




**ప్రభాత సూర్య చండూరు:** మున్సిపాలిటీలోని మెయిన్ రోడ్డు డివైడర్ కు రెండువైపులా మరియు డివైడర్ మధ్యలో ఎటువంటి ఫ్లెక్సీలను పెట్టకూడదని మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. మెయిన్ రోడ్డు వెంట, డివైడర్ పైన, యు టర్నింగ్ లలో, రోడ్డు మలుపులలో ఫ్లెక్సీలు పెట్టడం వల్ల యాక్సిడెంట్లు అవుతున్నాయని మున్సిపాలిటీ పాలకవర్గానికి ప్రజలు ఫిర్యాదు చేయడం వలన మున్సిపాలిటీ పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకున్నది . మెయిన్ రోడ్డు వెంట వున్న డ్రైనేజీ బయటి భాగంలో మాత్రమే ఫ్లెక్సీలు పెట్టుకోవాలని, మెయిన్ రోడ్ లో మరియు డివైడర్లలో ఎటువంటి ఫ్లెక్సీలు పెట్టరాదని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసుల, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, మున్సిపల్ కమిషనర్ ఎల్ మల్లేశం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఫ్లెక్సీలు పెట్టినట్లయితే ఫ్లెక్సీ షాప్ ల యాజమాన్యాలపై, ఫ్లెక్సీలు చేయించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్ర శేఖర్, బుషిపాక వాసు, సామ సుజాత యాదిరెడ్డి, జెల్ల ధనమ్మ శ్రీనివాస్, కొండ్రెడ్డి మధు, కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాత జనార్ధన్, కటకం రమేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు భరోసాగా రాష్ట్ర బడ్జెట్ ..

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐలయ్య యాదవ్.



**సశీస్థాన్ నారాయణపురం, మార్చి 20(ప్రభాత సూర్య):** రాష్ట్ర డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026 -27 రాష్ట్ర బడ్జెట్ భావితరాల భవిష్యత్తు కు భరోసాగా ఉంది. మూడు లక్షల 24 వేల 234 కోట్ల ( 3,24,234 )తో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలు ఆకాంక్షలు అనుగుణంగా ఆర్భాటాలకు పోకుండా వాస్తవాలకు దగ్గరగా ఉంది. ఈ బడ్జెట్లో విద్యకు 26,674 కోట్లతో బడ్జెట్లో పెద్దపీట వేశారు ..వైద్యానికి, పంచాయతీ గ్రామీణ అభివృద్ధి కొరకు రు.33, 688 కోట్ల తో అధిక ప్రాధాన్యత ప్రభుత్వం ఇచ్చింది. వ్యవసాయం, ఇరిగేషన్ కలిపి 45 వేల కోట్లకు పైగా బడ్జెట్ లో పెట్టి రైతులకు కూడా ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులు బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీలు మైనార్టీలు విద్యార్థి యువత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం .. అభివృద్ధి లక్ష్యంతో బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు కనపడుతుంది. భావి తరాల భవిష్యత్తుకు ఈ బడ్జెట్ లో ప్రభుత్వం బాటలు వేసింది. ఈ బడ్జెట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టుల తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు అధికంగా నిధులు కేటాయింప చేస్తారని ఆశ ఉంది..

# రాష్ట్ర ప్రభుత్వం అంకెలతో గారడి చేస్తుంది

### యువతను పూర్తిగా మోసం చేసింది

### తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పు కృష్ణ



యాదాద్రి భువనగిరి, మార్చి 20(ప్రభాత సూర్య): రాష్ట్ర ప్రభుత్వం అంకెలతో గారడి చేస్తుందని యువతను పూర్తిగా మోసం చేసిందని బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ అన్నారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వం ఇచ్చిన 60 వేల ఉద్యోగాలని మేమే భర్తీ చేసాము అన్నట్లుగా ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని, రాజీవ్ యువ వికాసమని స్కీము ప్రకటించి గ్రామీణ ప్రాంతాలలో ఎంతమందికి లబ్ధి చేకూరిందో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు లెక్కల కోసం అంకెలు సంఖ్యల పేరుతో గొప్పలకు పోతుంది తప్పితే ప్రభుత్వం నిరుద్యోగ యువతను పూర్తిగా మోసం చేసిందని అన్నారుస్వయం ఉపాధి పెంపొందించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉద్యోగాలు ఉపాధి కల్పన విషయంలో సరైన కార్యాచరణ ప్రభుత్వం దగ్గర లేదని ఎద్దేవా చేశారు. కొత్త కొత్త స్కీముల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద స్కాములకు పాల్పడుతుందని ప్రభుత్వ పాఠశాలలో మౌలికవస్తులు కల్పించి వాటిని పటిష్టం చేయకుండా ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా సొంత భవనాలు నిర్మించకుండా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో 5000 కోట్ల దోపిడీకి తెరలేపిందని తెలిపారు.గడిచిన విద్యా సంవత్సరం రాష్ట్రంలో 1400 పాఠశాలలను మూసివేసారని వాటిని తెరిపించే ప్రయత్నాలు ఏమి చేయకుండా కొత్త స్కూలు నిర్మిస్తామని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు గడిచిపోయిందని గొప్పలు చెప్పుకుంటున్న సందర్భంలో కనీసం ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం లేదని వాటిని అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆరోపించారు. అమరవీరుల కుటుంబాలను అవమానపరచడమే కాకుండా ఉద్యమకారులను మొత్తం కూడా మోసం చేసిందని ఈ బడ్జెట్ లో వారి ఊసే ఎత్తకపోవడం తెలంగాణ సమాజం గమనిస్తుందని అన్నారు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటామని ఉద్యోగాలు కల్పిస్తామని ఆర్థిక సహకారం అందిస్తామని ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం తో పాటు ప్రభుత్వ పింఛను వచ్చేలా చర్యలు చేపడతామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి వాటిని ఊసే ఎత్తకపోవడం గమనార్హం అన్నారు తులం బంగారానికి తూట్లు పొడిచి, కళ్యాణ లక్ష్మి చెక్కులే ఆలస్యంగా లబ్ధిదారులకు అందుతున్నాయని తెలిపారు ఆరోగ్యారంటీలకు 50 వేల కోట్లు కేటాయించామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం గతంలో పూర్తిస్థాయిలో ఏ ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదని మహాలక్ష్మి పథకం పెట్టిన తర్వాత చాలా రూట్లలో ఆర్టీసీ బస్సులు రద్దు చేశారని మిగిలిన అన్ని బస్సు చార్జీలు పెంచాలని, గృహజ్యోతి పథకం ద్వారా కనీసం 40% ప్రజలు కూడా లబ్ధి పొందడం లేదని తెలిపారు యువతను ఉద్యమకారులను మోసం చేసి వంచించిన బడ్జెట్లో వంచించారని ఎలాంటి కేటాయింపులు ఎలాంటి సానుకూల ప్రకటనలు కూడా రాకుండా మోసం చేశారని అన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ

### ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సిపిఐ ప్రతినిధి బృందం





**సశీస్థాన్ నారాయణపురం, మార్చి 20(ప్రభాత సూర్య):** వరి పంట వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం చిల్లాపురం లచ్చమ్మ గూడెం గ్రామాలలో వరి పంట వేసి ఎండిపోయిన రైతుల పొలాలను సిపిఐ మండల సమితి నాయకులు,రైతు సంఘం నాయకులతో కలిసి క్షేత్రస్థాయి లో పరిశీలించడం జరిగింది.అనంతరం వ్యవసాయ అధికారి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి చాలా గ్రామాలలో పొట్ట కొచ్చిన వరి చేను నెర్రెలు వారి ఎండిపోయినదని ఆరుకాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయంలో నీరు లేక ఎండిపోవడం మూలంగా రైతులు అప్పు చేసి పెట్టుబడులు పెట్టి అప్పులు తీర్చలేక పెట్టుబడి రాక చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారని వ్యవసాయ అధికారులు మండలంలోని అన్ని గ్రామాలను క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చి నష్టపోయిన రైతులకు ఎకరానికి 40 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పల్లె మల్లారెడ్డి నల్లవెల్లి ముత్యాలు కొప్పు సుధాకర్ దుబ్బాక కిషన్ రావుల ప్రశాంత్ మారగొని నాగరాజు ఈద మల్లయ్య పాలకూరి లక్ష్మమ్మ ,గండికోట లక్ష్మమ్మ , కొప్పు శివయ్య ,ఎల్లయ్య బొడ్డు లింగయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఛిద్రమైన కాళ్లకు రోబోటిక్ టెక్నాలజీతో శస్త్ర చికిత్స

### యశోద హాస్పిటల్స్ డాక్టర్ కిరణ్ కుమార్



**మిర్యాలగూడ, మార్చి 20:-( ప్రభాత సూర్య):** మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విజ్ఞానాన్ని అందించుకొని వైద్యశాస్త్రంలో ఎన్నో అద్భుతాలు ఆవిష్కరించబడుతున్నాయని అందులో భాగంగా రోబోటిక్ టెక్నాలజీతో అసాధ్యమైన ఆపరేషన్ సైతం సులభంగా చేయవచ్చునని నిరూపించామని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి బాదం తెలిపారు. శుక్రవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో స్వాగత్ హోటల్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ఛిద్రమైన ఇద్దరు వ్యక్తుల కాళ్లను రోబోటిక్ చికిత్స ద్వారా విజయవంతం చేశామన్నారు. దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామానికి చెందిన ఆడావత్ భీక్య, నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన పి.లక్ష్మారెడ్డి అనే ఇటీవల ఇద్దరు రోడ్డు ప్రమాదంలో ఇరువురి కాళ్లు పూర్తిగా ఛిద్రమైనాయని అన్నారు. మిర్యాలగూడ వైద్యుల సలహాతో యశోద హాస్పిటల్స్ కు వారు రాగా అసాధ్యమైన ఛిద్రమైన కాళ్లను తమ రోబోటిక్ పరిజ్ఞానంతో సుమారు 5 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ను విజయవంతం చేశామని తెలిపారు. దేశంలోనే అత్యంత నిపుణులు కలిగిన వైద్య బృందం యశోద హాస్పిటల్ లో ఉన్నారని, కష్టతరమైన ఆపరేషన్లను సైతం సులభంగా చేసి రోగి ప్రాణాలను కాపాడేందుకు అత్యంత నిబద్ధతతో సేవలు అందిస్తామన్నారు. రోబోటిక్ శస్త్ర చికిత్స అనంతరం 3నెలల్లోనే నడవ గలిగామని, అసాధ్యామనుకున్నది సాధ్యమైందని వారు తెలిపారు. ఒకరికి 6లక్షలు, మరొకరికి 9లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని తెలిపారు. తమ ఆసుపత్రిలో రోబోటిక్ చికిత్స సౌకర్యం ఉందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో హాస్పిటల్ సీనియర్ మేనేజర్ పరమేష్ అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ ఉన్నారు.

## ఘనంగా వెలిమలలో ఇఫ్తార్ విందు

### ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలు

### నియోజకవర్గ ప్రజలందరికీ ఈద్ ముబారక్

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రాపురం, మార్చి 20,ప్రభాత సూర్య :** మండలం లోని ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. ముస్లిం సోదరులకు కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లా కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

## తహశీల్ కార్యాలయంలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం చూపాలి

## బిజెపి మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 20(ప్రభాత సూర్య):** అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అలాగే మండల రెవెన్యూ అధికారిగా మీ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపి సంస్థాన్ నారాయణపురం మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సుర్వి రాజు గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది, కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదు ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి,వృద్ధాప్య,వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు,కళ్యాణ లక్ష్మి,పేదలకు గృహ నిర్మాణ పథకం,రైతులకు రైతు భరోసా,భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ అమలు చేయడం లేదు, ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు, నారాయణపురం మండలంలోని రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అలాగే వృద్ధాప్య,వితంతు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు మండలంలో దరఖాస్తులు చేసుకున్న అనేక మంది వృద్ధులు వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదు దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తుంది,పేదలకు ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోక్యం ఉండకూడదని నిష్పక్షపాతంగా లబ్ధిదారులను గుర్తించి ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు ఆ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము అదేవిధంగా నివాస ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది అనేక ప్రభుత్వ పథకాలకు ఈ పత్రాలే ప్రామాణికం కావడంతో నిర్ణీత సమయంలో ధ్రువీకరణ పత్రాలను జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగరి రఘు, మండల ప్రధాన కార్యదర్శి, పుట్టపాక ఉపసర్పంచ్ బండమీది కిరణ్,మండల ఉపాధ్యక్షులు,గుజ్జ ఉపసర్పంచ్ వెలిజాల శీను గోధుమ గడ్డ జంగారెడ్డ,గోధుమగడ్డ లింగారెడ్డి,కొర్రతండ గ్రామ వార్డు సభ్యులు కరెంటోత్,శంకర్ గంజి సునీల్, బొద్దుల సాంబశివరావు చిలివేరు సతీష్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



జైశ్రీరామ్ టీ టిఫిన్ హోటల్ ప్రారంభించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 20(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బాకారం రాకేష్ జైశ్రీరామ్ టీ, టిఫిన్ సెంటర్ ను సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎంఆర్ ఛానల్ మైపాల్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, చిలువేరు అంజయ్య, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు గౌడ్, యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, ఐ ఎన్ టి యు సి నాయకులు జక్కలి శ్రీశైలం యాదవ్, బానోతు కిరణ్, పానుగోతు గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు

## దేశం సుభిక్షంగా ఉండాలని సాయిబాబా భక్తుల యాగం



**ఖమ్మం (ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని షిరిడి సాయిబాబా ఆశ్రమం వద్ద ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో భారతదేశానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలు సుభిక్షంగా ఉండాలని షిర్డీ సాయిబాబా భక్తుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో యాగం నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆశ్రమానికి అన్నదాన కార్యక్రమంకు సహాయం అందించిన వారిని సెలవులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కటకం హనుమంతరావు దాసరి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు

## ఉగాది పచ్చడికి వేప పువ్వు, చిగుర్లు కరువు

**మిర్యాలగూడ , మార్చి 20:- (ప్రభాత సూర్య) :** నూతన తెలుగు పరాభావ నామ సంవత్సర ఉగాది షడ్రుచుల పచ్చడికి వేప పువ్వు, లేత ఆకులు కరువయ్యాయి, ఏదో శాస్త్ర ప్రకారం పండగ నిర్వహించారు. బెల్లం, చింతపండు, లేత వేపాకు, వేప పువ్వు, అల్లం, తదితర చేదు, తీపి, పులుపు కలగలుపుతో ఉగాది వేడుకకు ప్రత్యేకం. అయితే ఈ వేప చెట్టుకు శీలింద్రం వ్యాధి సోకడంతో ఆకులు ఎండి పోయాయి. దాదాపు 80 శాతం వేప చెట్లన్ని ఈ వ్యాధి బారిన పడి ఎండిపోయాయి. వేపాకు, పువ్వు కోసం ప్రజలు పట్టణానికి దగ్గరలో ఉన్న గ్రామాలలో ఆరోగ్యంగా పచ్చగా ఉన్న వేప చెట్ల కోసం వెదికి సాధించి ఉగాది చేసుకున్నారు.



## ఉపాధి హామీ పథకానికి 40 శాతం నిధులు కేటాయింపు లేని బడ్జెట్

### పింఛన్ల పెంపు ఊరసేలేని బడ్జెట్

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు అదనపు నిధులు లేవు

### కొత్త రేషన్ కార్డు దారులకు నిధుల కేటాయింపు లేదు



**భువనగిరి, మార్చి 20(ప్రభాత సూర్య):** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఆర్భాటంగా ప్రవేశపెట్టిన 3, 24, 234 కోట్ల బడ్జెట్లో గ్రామీణ ఉపాధి పనులు అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం నిధుల కేటాయింపు , పింఛన్ల పెంపు గురించి ఒక్క మాట మాట్లాడకపోవడం గ్రామీణ వ్యవసాయ కార్మికులను నిలువునా మోసం చేయడమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా అభిప్రాయపడ్డారు. పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం , కొత్తగా ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక్క పైసా కూడా ఈ బడ్జెట్ లో చూపులేదని అన్నారు. ఈ బడ్జెట్ లో నైనా 6 గ్యారంటీల అమలు కోసం నిధులు కేటాయిస్తారేమో అనుకుంటే నిరాశే మిగిలిందని తెలిపారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు 12000 చొప్పున ఇస్తామని వాగ్దానం చేసి కేవలం 6000 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని, కౌలు రైతులకు ఇస్తామన్న రూ 15000, ప్రతి మహిళకు రూ 25000లు, పెండ్లికి తులం బంగారం గురించి మాట మాత్రం కూడా ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క మాట్లాడలేదని తెలిపారు. రేషన్ కార్డులు 15 లక్షలు ఇచ్చామని పాత కార్డులలో 19 లక్షలకు పైగా పేర్లను యాడ్ చేశామని చెప్పిన ప్రభుత్వం గతంలో కేటాయించిన 3000 కోట్లను మాత్రమే బడ్జెట్లో చూపించారు కొత్తగా ఇచ్చిన రేషన్ కార్డులకు అదనపు నిధులను కేటాయించకపోవడం లబ్ధిదారులను మోసం చేయడమేనని అన్నారు. భూ నిర్వాసితులను ఆదుకోవడం, పునరావాస ప్యాకేజీ గురించి ప్రస్తావించకపోవడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. ఇది పూర్తిగా గ్రామీణ ప్రాంత పేదలను విస్మరించిన బడ్జెటని ఆవేదన వెలిబుచ్చారు.

## నర్సాపూర్ ఆర్డిఓ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల ధర్నా

### ఆర్డీవో కు వినతిపత్రం అందించిన ఆశా లు



**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి20:** మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు ఆశా వర్కర్లు గత రెండు నెలల నుండి తమకు జీతాలు రావడం లేదంటూ వెంటనే జీతాలు ఇప్పించాలని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు మినిమం వెజ్ అమలుచేస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారని వారు అన్నారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న నేటి వరకు మాకు కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. 20 రోజులు వేతనంతో కూడిన సెలవులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు గ్రామాల్లో ఏ రోగాలు ఉన్నాయి, వారికి ఏ రకమైన చికిత్సలు అందించాలి , గర్భిణీలను ఆస్పత్రులకు తీసుకెళ్లి డెలివరీలు చేయించేది ఆశాలు మాత్రమే, ఆరోగ్య సర్వేలు చేయించేది ఆశా వర్కర్ల తోనే అని వారి బాధలను వెలిబుచ్చారు. ఆశా వర్కర్లకు చాలి చాలని వేతనాలతో తమ జీవనం కొనసాగిస్తున్నామని ఆశ వర్కర్లు వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆశలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పర్మినెంట్ సౌకర్యం కల్పించాలని వారు ఆర్డిఓను కోరారు. ఈ కార్యక్రమంలో సంధ్య, లతా, అనుపమ, సుశీల, ఎం జమున, దేవి, సుధారాణి, పి అనిత, వి.లత, పి రాణి, డి మంజుల, వి జ్యోతి, ఆర్ లక్ష్మి, కృష్ణవేణి, ఇందిరా, చంద్రకళ, జి లక్ష్మి, రేఖ, సుజాత, లత, రాణి, మమత, జ్యోతి, ఆర్ లక్ష్మి, రత్న, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.

## రంజాన్ తోహ్ఫా లను అందజేసిన బిఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ మార్చి 20:-( ప్రభాత సూర్య):** పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలకు అందిస్తున్న రంజాన్ (తోహ్ఫా) కానుకలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బంగారుగడ్డ, పాత ఈద్గాహ్ వద్ద శుక్రవారం పంపిణి చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి నవీన్, నాయకులు ఎండి. అయూబ్, షేక్ అబ్దుల్లా, ఇమ్రాన్, కౌన్సిలర్స్ ఎండి. హామీదుద్దీన్ మొయిజ్, ఎం.ఎ. సలీం, ఎండి. ఫారుక్, బూడిద సైదులు, షేక్ జావెద్, గిరిధర్, కె. ఇంద్రకుమార్, మాజీ కౌన్సిలర్ ఏస్కె జానీ, మైనారిటీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ముస్లిం మైనారిటీలు, కుటుంబ సభ్యులు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## హాష్ ఆయిల్ ను విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎస్ఓటి పోలీసులు.....




**మాదాపూర్ ప్రభాత సూర్య :** అక్రమంగా హష్ ఆయిల్ను విక్రయిస్తున్న వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన కథనం ప్రకారం ... కర్నూల్కు చెందిన పరుసముల దినేష్ (28) కైతలాపూర్లో నివాసం ఉంటు మెకానిక్గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో హష్ ఆయిల్ను విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం 12:35 గంటల సమయంలో మాదాపూర్లోని అయ్యప్ప సొసైటీలో ఓ వ్యక్తికి అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు హుటాహుటీన అక్కడకు చేరుకొని నిందితున్ని అదుపులోకి తీసుకోని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దీంతో పోలీసులు నిందితున్ని విచారించగా అరకు నుండి హష్ ఆయిల్ను తీసుకువచ్చి అందులో రసాయానాలు కలిపి 10 లీటర్లకు బదులుగా 30 లీటర్లు తయారు చేసి 5 ఎంఎల్ చొప్పున బాక్స్లో పెట్టి హైదరాబాద్లోని పలువురికి రూ. 2 వేల నుండి 3 వేల వరకు విక్రయిస్తున్నాడు. అనంతరం నిందితుడి వద్ద రాయల్ ఎన్ఫీల్డ్ దిచక్ర వాహనం 1, మొబైల్ 1, రూ. 4.5 నుండి 5.లక్షల10 వెయ్యిల రూపాయలు విలువైన 1215 గ్రాముల 184 బాక్స్ల హష్ అయిల్ను స్వాధీనం చేసుకొని ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం... కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## ఖమ్మం జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు
### ఎంపిజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** పవిత్ర రంజాన్ పండుగ శుభ సందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్ జిల్లా ప్రజలందరికీ పండుగ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం క్యాలెండర్ లోని తొమ్మిదవ నెల అయిన రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం అని అన్నారు. పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే అవతరించింది అని తెలిపారు. పవిత్ర ఖురాన్ మానవులందరికీ మార్గదర్శకం కాబట్టి ముస్లింలు అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలను చేపడతారని అన్నారు. ఈ విధంగా ఎంతో పవిత్రమైన ఈ రంజాన్ పండుగ సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం తో కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులను చేయాలని సృష్టికర్తను కోరుకుంటున్నట్లు తెలిపారు.

## కింగ్స్ బజార్ హోమ్ నీడ్స్ జోన్ ప్రారంభం






**ఖమ్మం ( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగరం ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఎస్సార్ అండ్ బిజీఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా సాన్ ఎంటర్ప్రైజెస్ వారి కింగ్స్ బజార్ హోమ్ నీడ్స్ జోన్ ని ఉగాది పండుగ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దుగ్గిరాల స్రవంతి కడియాల అనిత కడియాల నీలిమ లు మాట్లాడుతూ మా బజార్లో బ్రాండెడ్ వస్తువులు ఎమ్మార్పీ ధర పై 50% ధరలకే హోమ్ నీడ్స్ ఎలక్ట్రికల్స్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు అందుబాటులో ఉంటాయని ఖమ్మం జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ళ లెనిన్ వివిఆర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్షల్లో చందానగర్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ఘన విజయం....





చందానగర్ ప్రభాత సూర్య : శ్రీ చైతన్య చందానగర్ విద్యార్థులు 2025-26 అకాడమిక్ సంవత్సరంలో మరో విజయాన్ని కైవసం చేసుకున్నారు . ఈ సంవత్సరానికిగాను జరిగిన ఐ.ఎన్.టి.ఎస్.ఓ (INTSO) పరిక్షల్లో విజేతలుగా నిలిచారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. మొదటి నిలిచిన ప్రైజ్ విజేతగా 6వ తరగతి విద్యార్థి జి.తరుణ్ సాయి ట్యాబ్ (గెలుచుకున్నాడు) .టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నాడు. బ్రాంచ్ మొత్తులో 54 మంది ! విద్యార్థులు స్వర్ణ పతకాలు మరియు ఇతర బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జోన్ ఏజీఎం శివరాదుకృష్ణ, ఆర్ ఐ పద్మజ, హైస్కూల్ జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, ప్రైమరీ కోఆర్డినేటర్ అన్నపూర్ణ . ప్రిన్సిపాల్ లక్ష్మీ దీప్తి, జాన్ ఉమా శ్రీను, ప్రైమరీ ఇన్ ?చళ్ళ ఇంచార్జ్ విశాలి తదితరులు పాల్గొన్నారు..

### విబి – జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి, పాత చట్టాన్ని కొనసాగించాలని

# ఉపాధి కార్మికులు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

### చేసిన పనికి కార్మికులకు పే స్లిప్ లు ఇవ్వాలి, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా



**భువనగిరి, మార్చి 20(ప్రభాత సూర్య):** మోడీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల, పేదల పోట్ట గోట్టడానికి తీసుకువచ్చిన విబి – జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికులు పనిచేసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరినారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల పని ప్రదేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్యతో కలిసి సందర్శించడం జరిగింది. అనంతరం వారి సమస్యలను తెలుసుకున్న తర్వాత వారిని ఉద్దేశించి నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు రెండు పూటల బువ్వ పెడుతు, ఆర్థికంగా ఉపయోగపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తుందని విమర్శించారు. అధికారం చేపట్టిన ఈ 11 సంవత్సరాల నుండి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కొత్త కొత్త జీవోలు తీసుకొచ్చి ఉపాధి హామీ కార్మికులను అనేక ఇబ్బందులు పెట్టారని అన్నారు. పని ప్రదేశాల్లో తాగడానికి నీళ్లు ఇవ్వకుండా, నిలువ నీడ లేకుండా, వారం వారం చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా, పనిచేస్తున్నప్పుడు ఫోటోలు దిగి పెట్టాలని వేధించారని వేధిస్తున్నారని అన్నారు. ఇప్పుడేమో అసలు ఉపాధి హామీ చట్టం లేకుండా జి రామ్ జి చట్టం తెచ్చి ఉపాధి హామీ కార్మికుల హక్కులను కూడా కాలరాసారని అన్నారు. 100% నిధులనుండి కేంద్రం తప్పుకొని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 40 శాతం నిధులు ఖర్చు చేయాలని పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తున్నారని ఈ కుట్రలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని నర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య మాట్లాడుతూ నాలుగు నెలలకు పైగా కార్మికులకు చేసిన పనికి డబ్బులు చెల్లించకపోతే కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాబు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వము ఎందుకు నూతన జాబు కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. అనేకమంది పని లేక జాబు కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, నూతన జాబు కార్డులు ఇవ్వాలని, జి రామ్ జి చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా పాత చట్టాన్ని అమలు చేసే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి, ఉపాధి కూలీలు బోమ్మారపు లావణ్య, శిరిష , లక్ష్మి, స్వాతి, సంగీత, ధనలక్ష్మి, క్రిష్ణ, రాంపల్లి శ్రీలత, లావణ్య,మమత, పల్లెపాటి శోభారాణి, లక్ష్మి, ర్యాకల లావణ్య, వరిగంటి రమాదేవి, లక్ష్మి, లావణ్య, గుండ్లపల్లి జ్యోతి, బీటుకూరు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

- అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు
- తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నం.
- మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు




**ఖమ్మం(ప్రభాత సూర్య ప్రతినిధి):** తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్దన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు వట్నట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రఫుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయన క్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్‌తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.



## మహిళా సంఘాలకు కోడి పిల్లల పంపిణీ

**మర్రిగూడ మార్చి 20 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలంలోని మహిళా సమైక్య కార్యాలయంలో శుక్రవారం రోజుల ఎన్ ఎల్ ఎం పథకం కింద మహిళా సంఘాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు కోడి పిల్లలు లను పంపిణీ చేశారు ఏపీఎం, వెంకట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 18 కోడి పిల్లలను అందజేశారు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీసీలు తదితరులు పాల్గొన్నారు

## వృధాగా మిషిన్ భగీరథ నీరు



**మర్రిగూడ మార్చి 20 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లి గ్రామం లో కర్నాటి వీరేశం ఇంటి వద్ద గత నెల రోజుల నుంచి వృథాగా పోతున్న సాగర్ వాటర్. మురికి నీరు తాగుతున్న కాలనీ వాసులు పట్టించుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది. గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు, అసలే వేసవికాలం పెరుగుతున్న ఎండలు నీటిని వృధా చేయకుండా వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నూతన ఆశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేసిన సోమ శ్రీనివాస్‌నీరజ దంపతులు



**గండిపేట : సూర్య ప్రతినిధి:** అత్తాపూర్ సర్కిల్ కాటేదాన్ డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో మహాయోగిని శ్రీ శ్రీధర శివరామ దీక్షిత సాంప్రదాయకం మహాయోగిని శస్త్రష మాంబ శాఖ శ్రీ కోట్ల నాగాయార్యుల ప్రియశిష్యరత్నంబగు సమరసానంద ముంగిమళ్ల కోట్ల నల్లయార్యుల అచలగురు మందిరం ఏర్పాటు చేస్తున్నారు. నూతన ఆశ్రమ నిర్మాణంకు అదనపు గది సోమ శ్రీనివాస్ ధర్మపత్ని నీరజ నిర్మాణకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మందిరం పెద్దలు సందుల హన్మంత్‌సాగర్, జక్కలపల్లి వెంకటయ్య, సందుల నారాయణసాగర్, పల్లపు జగన్, పోతురాజు మల్లేస్, ఎట్టి రాములు, పెద్ద హనుమంత్‌సాగర్, శంకర్, మణమ్మ, తిప్పన్న, బాలకృష్ణ, పాపిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు
### శుభాకాంక్షలు తెలిపిన కంచి మహేందర్



**బాలానగర్, మార్చి 20 (ప్రభాత సూర్య) :** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో సాదరంగా నిర్వహించిన వేడుకలు ఆప్యాయతతో నిండాయి. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ పాల్గొని ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి రాజేశ్వర్ రావు కూడా పాల్గొని ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో బాలేష్, అశోక్, శివ, రాధ్య శ్యామ్, వినేత్, డా. కంచి ప్రశాంత్, గోపాల్, సంతు తదితరులు హాజరై ఈటల రాజేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను ప్రతిబింబిస్తూ స్నేహసమ్మేళనంగా నిలిచింది.

# చండూరు ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

## వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని నల్గొండ ఎస్పీకి ఆదేశం

**ప్రభాత సూర్య చండూర్..:** జిల్లాలో సంచలనం సృష్టించిన హత్యాయత్నం ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ దారుణ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టి, వారం రోజుల్లోగా సమగ్రమైన 'చర్యల నివేదిక' (Action Taken Report) సమర్పించాలని నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను కమిషన్ ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. న్యాయవాది వినోద్ హిందుస్థానీ అందించిన ఫిర్యాదు మేరకు కమిషన్ ఈ కేసును విచారణకు స్వీకరించింది. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో చండూరు బీజేపీ కార్యకర్తలు దోటి కిరణ్ సహా మరో ఏడుగురిపై కొందరు దుండగులు పథకం ప్రకారం ప్రాణాంతక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘోరం జరిగి 48 గంటలు గడిచినా పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదని వినోద్ హిందుస్తానీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషన్ ఆదేశాలు ఇవే.. (Case No-210/36/7/2026): బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి ఈ కేసులో తీసుకున్న చర్యల నివేదికను ఆంగ్లంలోకి అనువదించి ఒక వారం లోపు కమిషన్‌కు పంపాలి. సంబంధిత వివరాలను హెచ్‌ఆర్‌సీ నెట్ పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాలని, ఈమెయిల్ నివేదికలను పరిగణించబోమని కమిషన్ స్పష్టం చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కమిషన్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.


## ఆలేరు నియోజకవర్గంలో రాజకీయ పార్టీ అధికారులతో సమావేశం...



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య....:** యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆలేరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ా×=--2026 కార్యక్రమానికి సంబంధించిన నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2026 ఏప్రిల్ నెల నుంచి డోర్ టు డోర్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 2002 ఓటర్ల జాబితాలో ఉండి 2025 ఓటర్ల జాబితాలో కొనసాగుతున్న ఓటర్లను ఇప్పటికే మ్యాపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించేందుకు బిఎల్‌ఓ లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపడతారని తెలిపారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలకు అవకాశం కల్పించనున్నట్లు, అందువల్ల అన్ని పార్టీలు తమ తమ బీఎల్‌ఏలను నియమించుకోవాలని సూచించారు. ప్రజలు తమ తమ దీూాలకు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు వి. ఆంజనేయులు నాయక్, అశోక్, అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు దూసరి మురళి, గంగుల శ్రీనివాస్, దూపటి వెంకటేష్, మొరిగాడి శ్రీశైలం, పూజారి కుమారస్వామి, పుట్ట మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 2026-27 తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఏ మాత్రం తోడ్పడదు...

### ఆర్.జనార్ధన్,జిల్లా కార్యదర్శి సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ ....



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య..:** మార్చ్ 20 న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ను చూసినట్లయితే రాష్ట్ర అభివృద్ధికి ఏ మాత్రం తోడ్పడదని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమో క్రసీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ స్పష్టం చేశారు. రైతాంగానికి, వ్యవసాయరంగానికి కేటాయించిన బడ్జెట్ రైతు ప్రయోజనాలు, సంక్షేమానికి సరిపోదని, రైతు భరోసా ను మరింత బలహీనపర్చేదిగా ఉన్నదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, సంపదను సృష్టించడంలో ఎంతో కృషిచేస్తున్న కార్మిక వర్గానికి అతి తక్కువ నిధులు కేటాయించడం అన్యాయం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీ సీ, మైనారిటీ ఇతర వర్గాలకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయకుండా చిన్నచూపు చూడటం సబబుకాదని అన్నారు. విద్యా, వైద్యం రంగాలు ప్రధానమైనవైనప్పటికి నిధులు కేటాయించడం లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కైనట్లుగానే వ్యవహరించిందని అన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్ పెంచడం గానీ, కొత్త వారికి పెన్షన్ లు ఇవ్వడమనేది అసాధ్యమని ఈ బడ్జెట్ తేల్చిందని అన్నారు. రాష్ట్రానికి కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని గొప్పలు చెప్పినప్పటికీ రాష్ట్ర బడ్జెట్ చూస్తే అన్ని వర్గాల ప్రజలను నిరాశకు గురిచేసిందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ బావుస్తుందని అన్నారు.

# నూతన పాలకవర్గానికి ఆత్మీయ అభినందన సత్కారం

## అభినందన సత్కారాలు, ఉగాది పురస్కారాలు అభినందనీయం...... చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్






**చౌటుప్పల్,మార్చి 20, ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ పరాభవ నామ ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం దేవస్థాన ప్రాంగణములో చౌటుప్పల పురపాలక సంఘం నూతన పాలకవర్గమునకు ఆత్మీయ అభినందన సత్కారం, ఉగాది పురస్కారాల కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ పురపాలక సంఘం నూతన పాలకవర్గమునకు ఆత్మీయ అభినందన సత్కారాలు, ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ ఛైర్మన్ గోశిక వినయ్ కుమార్, 1వ వార్డ్ కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి, 2వ వార్డ్ కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, 3వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, 4వ వార్డ్ కౌన్సిలర్ ఊదరి యాదయ్య , 5వ వార్డ్ కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ , 6వ వార్డు కౌన్సిలర్ ఆలే శ్రీలత చిరంజీవి, 7వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి , 8వ వార్డు కౌన్సిలర్ బద్రి గాలయ్య, 10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు, 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్,15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిర రాజారత్నం, 16వ వార్డ్ కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు గౌడ్, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు,18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ , 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ హన్నుబాయ్ లకు దేవస్థానం తరఫున ఆత్మీయ అభినందన సత్కారంను ఉగాది పురస్కారములను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమానికి శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థాన కమిటి అధ్యక్షులు బడుగు జయప్రకాష్ అధ్యక్షత వహించగా, దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ వ్యాఖ్యాతగా వ్యవహరించగా దేవస్థాన ధర్మకర్తలుబడుగు లక్ష్మయ్య,చిక్క నరసింహ ,గోశిక అంజయ్య, బడుగు శ్రీరాములు,గుర్రం వెంకటేశం, వనం ధనుంజయ, గుర్రం పాండురంగ, గోశిక నరసింహ, దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్ , గోశిక బాలాజీ , సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్ , శ్రీమతి గోశిక చంద్రకళ నరసింహ,కోశాధికారి బడుగు సుజాత నర్సింహ ,సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్ , ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్ధన్,సమన్వయ కార్యదర్శి బాల్యం అనిల్ కుమార్ తో పాటు మరుద్వతి దేవస్థాన కమిటి అధ్యక్షులు గుర్రం నరసింహ , భావనారుషి కళానికేతన్ అధ్యక్షులు బడుగు బాలరాజు, క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి శ్యామ్ , దేవస్థాన ప్రధాన అర్చకులు గంజి నరసింహులు శర్మ , గంజి అనంతరామ కిరీటి, భక్తులు పాల్గొన్నారు.

# ఆలేరు కనకదుర్గ మాత ఆలయంలో నూతన మున్సిపల్ పాలక వర్గానికి ఘన సన్మానం....



**ఆలేరు మార్చి 20 పభ్రాత సూర్య :** దుర్గమాత ఆశీస్సులు అందుకున్న చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఆలేరు పట్టణంలోని కనకదుర్గ మాత ఆలయంలో నూతనంగా ఏర్పడిన మున్సిపల్ పాలక వర్గానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గమాత ఆశీస్సులుఅందుకున్నారు. అనంతరం వారికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఆశీర్వదించారు. బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు, మల్లెల సరిత శ్రీకాంత్, జెట్ట నిరజ సిద్ధులు, పస్తం ఆంజనేయులు, బోట్ల సంపత్, పాకాల మౌనిక హరీష్, జూకంటి సంపత్, బీజని కళ్యాణి మధు, పాసికంటి సంపత్,ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు కొలుపుల హరినాథ్, బేతి రాములు, నీలం పద్మ , కట్టెగుమ్ముల సాగర్ రెడ్డి, ఎగ్గిడి శ్రీశైలం, నీలం వెంకటస్వామి, ముదికొండ శ్రీకాంత్, మంగ నరసింహులు, కంతుల శంకర్, వడ్డేమాన్ నరేందర్, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యార్థుల అవసరాలను తీర్చే స్థాయిలో బడ్జెట్ లేదు

### పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలి

### జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పరిశోధనలు పట్టించుకోవడం లేదు

### జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉద్యకారులు ఎరవెల్లి జగన్



**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత సూర్య):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, విద్యార్థుల అవసరాలను పూర్తిగా తీర్చే స్థాయిలో లేదని బడ్జెట్ పైన తెలంగాణ రాష్ట్ర ఉద్యకారుడు, జేఎన్టీయూహెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ అన్నారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు ముందుగానే ప్రకటించింది కానీ విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్, కొత్త కోర్సులు, టెక్నాలజీ ఆధారిత బోధన ( ఏఐ ట్యూటర్లు వంటి) ప్రవేశపెట్టే దిశగా చర్యలు కనిపిస్తున్నాయి. అయితే, గత బడ్జెట్లలో విద్యకు కేటాయించిన నిధులు మొత్తం బడ్జెట్‌లో కేవలం 7--9% మధ్య మాత్రమే ఉండటం గమనార్హం. కనీసం 18% వరకు పెంచాలని అన్నారు. ఇక విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో ఆలస్యం ఇంకా పెద్ద సమస్యగానే ఉందని వాపోయారు. మొత్తం మీద, ఈ బడ్జెట్ విద్యార్థులకు కొన్ని అవకాశాలు కల్పించినప్పటికీ, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం మరింత బలమైన పెట్టుబడులు అవసరమని తెలియజేసారు. ఆలోకేషన్ సరిపోదు --- ఇదే పెద్ద సమస్య. తెలంగాణ ఎడ్యుకేషన్‌కు ది7--9% మాత్రమే ఇస్తోంది. ఇతర రాష్ట్రాలు 15--20% ఇస్తున్నాయి. బీహార్ ది21%, తెలంగాణ ది9%



ప్రాధాన్యం" అంటున్నారు కానీ డబ్బు మాత్రం తక్కువ. అదేవిదంగా స్కీమ్స్ ఉన్నాయి కానీ ఎగ్జిక్యూషన్ బలహీనంగా ఉంది. స్కాలర్‌షిప్‌లు ఆలస్యం,ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్, బడ్జెట్‌లో అనౌన్స్ ? గ్రౌండ్లో డిలే, అదేవిదంగా కొత్త ఐడియాస్ ఉన్నాయి. కానీ కోర్ ప్రాబ్లమ్స్, అన్ టచుడ్, ఆల్ ట్యూటర్స్ ,టీచర్ షార్టెజ్ ఉంది. కాలేజీల్లో ఫాకల్టీ లేదు. అదేవిదంగా యూనివర్సిటీలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది, ఖాళీలు ప్రొపెసర్ల భర్తీకి శూన్యం, పరిశోధనల ఊసే లేదు. ఉస్మానియా యూనివర్సిటీ వెయ్యి కోట్లు స్వాగత్తిస్తాం కానీ జేఎన్టీయూహెచ్ అనుబంధ కళాశాల సంగతి ఏంటి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏకైక టెక్నాలజీ యూనివర్సిటీ యూనివర్సిటీ ఆఫిలేటెడ్ ప్రయివేట్ కాలేజీలు రాష్ట్ర మొత్తం ఉన్నాయి, లక్షలో విద్యార్థులు ఉన్నారు. జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కి మీరు కేటాయించిన బడ్జెట్ ఎంత అని ప్రశ్నించారు. రియంబర్స్ మెంట్ పెండింగ్ లో ఉండటం వల్ల ఎస్సి, ఎస్టీ, బీసీ, వెనుకబడిన ఓబీసీ విద్యార్థులు విద్యకు దూరం ఆయె అవకాశం ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బేషరుతుగా ఈ బడ్జెట్ లోనే యూనివర్సిటీల సంక్షేమం, సమస్యలపై ఎక్కువ నిధులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఎరవెల్లి జగన్ ను కోరారు.

# భారతదేశంపై ఇరాన్-అమెరికా యుద్ధ ప్రభావం



ప్రపంచ పటంలో మధ్యప్రాచ్యం ఎప్పుడూ ఒక రగిలే అగ్నిపర్వతమే. కానీ ఇప్పుడు ఆ అగ్నిపర్వతం విస్ఫోటనానికి సిద్ధంగా ఉందా? అన్న ప్రశ్న ప్రపంచ దేశాల మేధావులను వేధిస్తోంది. అమెరికా అధ్యక్ష పీఠంపై డొనాల్డ్ ట్రంప్ తన రెండవ ప్రస్థానాన్ని ప్రారంభించిన వేళ, వైట్ హౌస్ నుండి వెలువడుతున్న సంకేతాలు మునుపెన్నడూ లేనంత గంభీరంగా ఉన్నాయి. మేము దేనికైనా సిద్ధం అన్న ట్రంప్ హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితం అవుతాయా లేక పశ్చిమ ఆసియా ఆకాశంలో క్షిపణుల గర్జనలు వినిపిస్తాయా? అసలు ట్రంప్ దృష్టి ఇరాన్ మీద అంత కఠినంగా ఎందుకు ఉంది? ఈ ఉద్రిక్తతల వెనుక ఉన్న (మీఖఇఅఎబఎ ౹ాతీవంంబతీవ) మంత్రాన్ని మరింత పదును పెడుతున్నారు. ఇది కేవలం దౌత్య యుద్ధం కాదు, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న సమయం.ట్రంప్ వ్యూహకర్తగా ఆలోచిస్తారు. ఆయన ప్రతి అడుగు వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. ఇరాన్ విషయంలో ఆయన దూకుడుకు ఐదు ప్రధాన స్తంభాలు ఉన్నాయి,ప్రపంచ అణు శక్తి సంస్థ (×ూాజూూ) లెక్కల ప్రకారం, ఇరాన్ తన యురేనియంను 60 శాతానికి పైగా సుసంపన్నం చేసింది. అణు బాంబు తయారు చేయడానికి 90 శాతం సుసంపన్నత చాలు. అంటే, ఇరాన్ అణు స్వప్నానికి కూతవేటు దూరంలో ఉందన్నమాట. బెదిరింపులకు ఇరాన్ భయపడి పోతోందని అనుకుంటే పొరపాటే. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మరియు సర్వోన్నత నేత ఆయతుల్లా ఖమేనీ తమ వైఖరిని స్పష్టం చేశారు. మా హక్కులను ఎవరూ లాక్కోలేరు అని వారు గర్జిస్తున్నారు. ఒకవేళ అమెరికా దాడి చేస్తే, ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరా అయ్యే హర్మ్యూజ్ జలసంధి ని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఇదే కనుక జరిగితే, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. ఎందుకంటే 20% ప్రపంచ చమురు అక్కడి నుంచే రావాలి.యుద్ధం ఎప్పుడు మొదలవుతుందో ఎవరూ చెప్పలేరు కానీ, మొదలైతే ఎంత కాలం నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడి నడ్డి విరుగుతుంది.ఇరాన్‌లో భారత్ భారీగా పెట్టుబడి పెట్టిన చబహార్ ఓడరేవు ప్రమాదంలో పడుతుంది. ఇది మన వ్యూహాత్మక వాణిజ్యానికి పెద్ద దెబ్బ. గల్ఫ్ దేశాలలో ఉన్న లక్షలాది మంది భారతీయుల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. వారి ఉద్యోగాలు పోతే మన దేశ ఆర్థిక వ్యవస్థకు వచ్చే విదేశీ మారక ద్రవ్యం నిలిచిపోతుంది. ప్రస్తుతానికి పరిస్థితి కత్తి మీద సాము లా ఉంది. ఒకవైపు యుద్ధ ట్యాంకులు సిద్ధమవుతుంటే, మరోవైపు ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు శాంతి చర్చల కోసం తలుపులు తడుతున్నాయి. ట్రంప్ కోరుకుంటున్నది పూర్తి నిరాయుధీకరణ ,ఇరాన్ అసలు గేమ్ ప్లాన్ ఏమిటి?అమెరికా ఇరాన్ మధ్య వైరం నిన్న మొన్నటిది కాదు. ఇది దశాబ్దాల నాటి చేదు జ్ఞాపకం. 1979లో ఇరాన్‌లో వచ్చిన ఇస్లామిక్ విప్లవం ఈ రెండు దేశాల మధ్య స్నేహ వారధిని కూల్చేసింది. అప్పటి నుండి మొదలైన ఈ కోల్డ్ వార్ , ట్రంప్ మొదటి పాలనలో (2017-2021) పతాక స్థాయికి చేరుకుంది.గుర్తుందా? 2018లో అప్పటికే అమల్లో ఉన్న ఇరాన్ అణు ఒప్పందం (జీజూూూ) నుండి ట్రంప్ ఏకపక్షంగా బయటకు వచ్చారు. అది చాలదన్నట్లు, ఇరాన్ గర్వించే సైనిక మేధావి జనరల్ ఖాసిమ్ సులేమానీని 2020లో డ్రోన్ దాడితో హతమార్చడం ద్వారా అమెరికా తన ఉగ్రరూపాన్ని చూపింది. ఇప్పుడు 2025లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన ట్రంప్, తన పాత గరిష్ట ఒత్తిడి ఇరాన్ చేతికి అణ్వాయుధం చిక్కితే, మధ్యప్రాచ్యంలో అమెరికా మాటకు విలువుండదు. అందుకే, ఆ బాంబు తయారీ కాకముందే దాన్ని నాశనం చేయాలనేది ట్రంప్ అసలు ప్లాన్. ట్రంప్ మరియు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మధ్య ఉన్న అనుబంధం జగద్విదితం. ఇరాన్ అణు కేంద్రాలను నేలమట్టం చేయాలని ఇజ్రాయెల్ ఎప్పటి నుంచో తహతహలాడుతోంది. కానీ, అమెరికా అండ లేకుండా అది అసాధ్యం. ఇప్పుడు ట్రంప్ రూపంలో ఇజ్రాయెల్‌కు ఒక బలమైన మిత్రుడు దొరికాడు. ఈ ఇద్దరు కలిస్తే ఇరాన్ మ్యాప్ మారిపోవడం ఖాయమన్నది విశ్లేషకుల మాట. మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఒక శక్తివంతమైన షాడో కింగ్ లా వ్యవహరిస్తోంది. హమాస్, హెజ్బుల్లా, హూతీ రెబల్స్.ఇలా ఎక్కడ అలజడి జరిగినా దాని వెనుక ఇరాన్ హస్తం ఉంటుందని అమెరికా గట్టి నమ్మకం. సౌదీ అరేబియా వంటి అమెరికా మిత్ర దేశాలను కాపాడుకోవాలంటే, ఇరాన్ రెక్కలు విరవక తప్పదు. ఇరాన్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలున్న దేశాలలో ఒకటి. ఆంక్షల ద్వారా ఇరాన్ ఆర్థిక వెన్నెముకను విరిచి, ప్రపంచ మార్కెట్లో చమురు ధరలను తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇది ఆర్థిక ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరాటం కూడా. అమెరికా ఓటర్లకు ట్రంప్ ఒక స్ట్రాంగ్ మ్యాన్ . శత్రువుల కళ్లలోకి చూసి హెచ్చరించే నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇరాన్ ఒక గొప్ప వేదిక. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ఆయన తన దేశ ప్రజల మద్దతును కూడగట్టుకుంటున్నారు.అమెరికా సాగుతుందనే దానిపై రెండు రకాల అంచనాలు ఉన్నాయి. కేవలం ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా లేదా ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేయవచ్చు. ఇది ఒకట్రెండు రోజుల్లో ముగిసే ప్రహసనం కావచ్చు. ఒకవేళ ఇరాన్ ఎదురుదాడికి దిగితే, అది లెబనాన్, యెమెన్, సిరియా మీదుగా మధ్యప్రాచ్యం అంతటా విస్తరిస్తుంది. రష్యా మరియు చైనా గనుక ఇరాన్‌కు అండగా నిలిస్తే, అది మన కళ్ల ముందే మూడవ ప్రపంచ యుద్ధానికి (ఔశీతీశ్రీ‌ఐ ఔష్మతీ ×××) నాంది కావచ్చు.మనం ఎక్కడో దూరంగా ఉన్నాం కదా అని అనుకోవడానికి వీలు లేదు. ఇరాన్‌అమెరికా యుద్ధం జరిగితే మన వంటిళ్లలో మంటలు చెలరేగుతాయి.చమురు సరఫరా ఆగితే పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఫలితంగా కోరుకుంటున్నది ఆత్మగౌరవం . ఈ రెండింటి మధ్య రాజీ కుదరకపోతే ప్రపంచం ఒక చీకటి అధ్యాయంలోకి జారిపోయే ప్రమాదం ఉంది.శాంతి అనేది ఒక ఆప్షన్ కాదు, అది ఒక అవసరం. యుద్ధం వల్ల ఎవరూ గెలవరు, కేవలం శవాల దిబ్బలు మాత్రమే మిగులుతాయి. ప్రపంచ నాయకులు అహంకారాన్ని వీడి, ఆయుధాలను పక్కన పెట్టి, అవగాహనతో ముందుకు సాగాలని ఆశిద్దాం. ఎందుకంటే, మరో యుద్ధం భరించే శక్తి ఈ భూగోళానికి లేదు!

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169



## జగన్ కు తప్పని కుటుంబ పోరు!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఆంధ్రప్రదేశ్ బ్యూరో :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పై సొంత కుటుంబ సభ్యులే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆయనను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. తన కుమార్తె షర్మిల పిల్లలను కుమారుడు జగన్మోహన్ రెడ్డి అన్యాయం చేస్తున్నారంటూ విజయమ్మ ఆరోపిస్తున్నారు. అన్న అనే పదానికి జగన్ మోహన్ రెడ్డి కళంకం అని షర్మిల తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇటీవల జగన్మోహన్ రెడ్డి తల్లితోపాటు చెల్లెలికి దగ్గరవుతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ అది ఎంత మాత్రం నిజం కాదని తాజాగా తేలిపోయింది. విజయమ్మతో పాటు షర్మిల ఇద్దరూ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. మరోవైపు వివేకానంద రెడ్డి కుమార్తె సునీత నుంచి నేరుగా జగన్మోహన్ రెడ్డి పైనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ముప్పేట దాడితో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా డ్యామేజ్ అవుతున్నారని వైసీపీలో ఒక ప్రచారం తో పాటు భయం ఉంది.

**భారీగా డ్యామేజ్ చేసిన షర్మిల..**

జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయడంలో ఆయన సోదరి షర్మిల సక్సెస్ అయ్యారు. గత ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. ఆమె కాంగ్రెస్ పార్టీ బలోపేతం కంటే జగన్మోహన్ రెడ్డి పతనం కోసం ఎక్కువగా పరితపించారు అన్నది బహిరంగ రహస్యం. వివేకానంద రెడ్డి హత్య నుంచి వైసిపి ప్రభుత్వ వైఫల్యాల వరకు ఏకిపారేశారు. అదే సమయంలో వైయస్ విజయమ్మ సైతం షర్మిలను గెలిపించండి అని కడప జిల్లా ప్రజలను కోరారే తప్ప.. మరోసారి తన కుమారుడికి ఛాన్స్ ఇవ్వాలని ఆమె కోరలేదు. తద్వారా తన ఆశీర్వాదం కుమార్తె షర్మిలకు తప్ప కుమారుడు జగన్మోహన్ రెడ్డికి లేదని ఆమె సంకేతాలు పంపారు. పరోక్షంగా మంచి పరిపాలన జగన్ అందించలేకపోయారని ప్రజల్లో అభిప్రాయం వచ్చేలా వ్యవహరించారు. అందుకే ఆ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి భారీ పొలిటికల్ డామేజ్ జరిగింది. దారుణాతి దారుణంగా ఓడిపోయారు ఆంధ్ర ప్రదేశ్లో.

**కలిసిపోతారంటూ వార్తలు..**

అయితే వైయస్ కుటుంబ చరిత్ర మసకబారడంతో.. ఆ కుటుంబ సన్నిహితులు రంగంలోకి దిగి తల్లితో పాటు ఇద్దరు పిల్లలను కలుపుతారని వార్తలు వచ్చాయి. కానీ అదంతా ఉత్త ప్రచారం అని తేలిపోయింది. ఏకంగా విజయమ్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైయస్ కుటుంబ ఆస్తి మొత్తం తన నలుగురు మనవలు, మనవరాలుకు సమానంగా పంచాలని రాజశేఖర్ రెడ్డి నిర్ణయించారని చెప్పుకొచ్చారు. షర్మిల తన పిల్లలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన ఆస్తుల కోసమే అడుగుతున్నారు తప్ప మరొకటి కాదు అన్నారు. తన కుమారుడు షర్మిల పిల్లలకు అన్యాయం చేస్తున్నాడు అంటూ జగన్ పైనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు విజయమ్మ. ఇంకో వైపు జగన్మోహన్ రెడ్డి అన్న అనే పదానికి కలంకం అన్న పెద్ద మాట వాడేశారు షర్మిల. తద్వారా ఆ కుటుంబంలో పరిస్థితి చేయి దాటిపోయింది. మళ్లీ వారి మధ్య సయోధ్య పరిస్థితి కనిపించడం లేదు.

**ముగ్గురు మూడు వైపులా..**

ఒకవైపు షర్మిల, ఇంకోవైపు విజయమ్మ దాడి కొనసాగుతుండగా.. మరోవైపు వివేకానంద రెడ్డి కుమార్తె షర్మిల విరుచుకుపడుతున్నారు సోదరుడు జగన్మోహన్ రెడ్డి పై. ఇటీవల జరుగుతున్న పరిణామాలతో ఆమె మీడియా ముందుకు వచ్చి తన తండ్రి హత్య వెనుక సూత్రధారులను బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిందితులను జగన్మోహన్ రెడ్డి కాపాడారని బాహాటంగానే చెబుతున్నారు. అయితే ఇటీవల రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో పరిస్థితులు కుదురుకున్నాయని అంతా భావించారు. కానీ అప్పటికంటే మరింత వివాదాలు పెరిగాయని సంకేతాలు అందుతున్నాయి. 2029 ఎన్నికల్లో కూడా ఆ కుటుంబం ఏకతాటి పైకి రావడం కష్టమేనని తేలిపోతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

## హర్మ్యూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిసైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే. భారీ ఆయుధాలతో ఎ-10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఇవి హర్మ్యూజ్ జలసంధిపై అతితక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రులక్ష్యాలను మట్టుబెడుతున్నాయి. ఎ-10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌లను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే.. ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ-10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో ÷టైర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ-10 విమానాలను పదాతి దళాలకు క్లోజ్‌ఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎం గన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ-10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మ్యూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే హోర్ముజ్ జలసంధి రక్షణ ప్రయత్నాల్లో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటామని ఐరోపా దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. గల్ఫ్‌లో నిరాయుధ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల జరిపిన దాడులను, చమురు మరియు గ్యాస్ సహా పౌర మౌలిక సదుపాయాలపై జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన పేర్కొంది. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తీవ్రమవుతున్న ఘర్షణ పట్ల మేము తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. ఇరాన్ తన బెదిరింపులను, డ్రోన్ మరియు క్షిపణి దాడులను, వాణిజ్య నౌకాయానానికి జలసంధిని అడ్డుకునే ఇతర ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు కట్టుబడి ఉండాలని పిలుపునిస్తున్నామని పేర్కొంది. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి తగిన ప్రయత్నాలకు సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. సన్నాహక ప్రణాళికలో నిమగ్నమైన దేశాల నిబద్ధతను మేము స్వాగతిస్తున్నామని ప్రకటన పేర్కొంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయడానికి అధికారం కల్పించిన అంతర్జాతీయ ఇంధన సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. ఉత్పత్తిని పెంచడానికి కొన్ని ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేయడంతో సహా, ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఇతర చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం: చంద్రబాబు వెల్లడి

అమరావతి,మార్చి 20:ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్



చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 'మన పండగలు, ఆచారాల్లోనే సైన్స్ ఉంది. వాస్తు, సూర్య నమస్కారాలు ఇలాంటివే. యోగా, నేచురోపతి కూడా ప్రకృతి నుంచి వచ్చినవే. విలువలతో జీవనం గడిపేవారికి ఉన్న ఆనందం మరెవరికీ ఉండదు. మనకంటే విదేశాల్లోని ప్రవాసాంధ్రులు మన సంస్కృతీ సంప్రదాయాలు పాటించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యభద్రత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ శక్తి, స్త్రీశక్తి పథకాలతో దివ్యాంగులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సంపన్నులైన 10శాతం మంది సమాజంలో అట్టడుగున ఉన్న 20శాతం మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితమిస్తాం.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.